సాక్షి ప్రకాశం

గురువారం, 23, ఫిబ్రవరి, 2023



కొత్త ఆలోచనలతో పురోగమించాలి

సరికొత్త ఆలోచనలతో విజయం సాధించాలని జేసీ అభిషిక్త్ కిషోర్ అన్నారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఆయన మాట్లాడారు. - 8లో..



జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.550 కోట్లు

జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.550 కోట్లు ఉన్నాయని ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 33 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వల్లూరమ్మ ఆలయ దుకాణాల వేలం ఆదాయం రూ.29,26,000



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ దేవస్థానంలో ఆలయానికి చెందిన దుకాణాలు, వివిధ ఐటములకు టెండర్, బహిరంగ వేలం బుధవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ బహిరంగ వేలం ద్వారా దేవస్థానానికి రూ.29,26,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బి.రమేష్ తెలిపారు. వేలం పాటలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


రేపు మాగుంట ఒంగోలు రాక

ఒంగోలు టౌన్: ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం నగరంలో పర్యటించనున్నారు. ఈ మేరకు మాగుంట కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 8 గంటలకు కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు స్థానికంగా జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 5 నుంచి తిరిగి కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు

ఒంగోలు టౌన్: అర్హతలు కలిగి ఉండి ఇంటర్మీడియెట్ చదువుకునే అవకాశం చేజారిన విద్యార్థులు సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 2022–23 విద్యాసంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 లోపు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మార్చి 1 నుంచి 7వ తేదీ లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డిని సంప్రదించాలని సూచించారు.

గృహ లక్ష్యం.. ఓ యజ్ఞంగా..



చీమకుర్తి సమీపంలోని కేవీ.పాలెం రోడ్డులో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించి గృహప్రవేశం జరిగిన ఇల్లు

ఈ చిత్రంలో చూస్తున్న సుందరమైన ఇల్లు.. నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పేదలందరికీ ఇళ్లు' పథకం ద్వారా నిర్మించుకుంది. ఇలాంటి సొంత ఇల్లు ప్రతి ఒక్కరికీ ఓ అందమైన కల. ఆ కోరికను సాకారం చేసే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ఉగాది లోగా గృహ ప్రవేశాలు చేపట్టాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఓ యజ్ఞాన్ని చేపట్టింది. జిల్లాలో 9,728 ఇళ్లు పూర్తి చేయాలన్న దిశగా చర్యలు వేగవంతం చేశారు.



చీమకుర్తి సమీపంలోని కేవీ.పాలెం రోడ్డులో జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించి గృహప్రవేశం జరిగిన ఇల్లు

నియోజకవర్గాల వారీగా గృహాలు


ఒంగోలు	19,889
సంతనూతలపాడు	6519
దర్శి	5012
కనిగిరి	3455
కొండపి	8119
గిద్దలూరు	7796
మార్కాపురం	13151
యర్రగొండపాలెం	3728

- ఉగాదికి 9,728 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటికే 2,505 గృహాలు పూర్తి
- మరో 7,223 లక్ష్యంగా ముందుకు
- నూతనంగా జిల్లాలో 570 జగనన్న కాలనీలు
- జిల్లా వ్యాప్తంగా 67,669 నూతన గృహ నిర్మాణాలు
- వేగంగా నిరుపేదల కల నెరవేరుస్తున్న సీఎం జగన్
- ఇప్పటికే జిల్లాలో రూ. 284.18 కోట్లు ఖర్చు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలు సొంతింటి కల నెరవేర్చుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తోడ్పాటునందిస్తున్నారు. దేశంలోనే ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా పేదలకు ఇళ్లు కట్టించాలన్న ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాలు... జగనన్న కాలనీల రూపంలో జిల్లాలో కొత్తగా గ్రామాలకు గ్రామాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్తగా 570 జగనన్న కాలనీల నిర్మాణం చేపట్టింది. ఒంగోలు నగరంతో పాటు మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, చీమకుర్తి పట్టణాల్లో దాదాపు 19 జగనన్న కాలనీలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా జరుగుమల్లి మండలంలో 30 జగనన్న కాలనీలు నిర్మాణంలో ఉన్నాయి. ఆ తరువాత పొన్నలూరు మండలంలో 29, మద్దిపాడు మండలంలో 28, గిద్దలూరు మండలంలో 27, తర్లుపాడు మండలంలో 25, పొదిలి మండలంలో 23, నాగులుప్పలపాడు, చీమకుర్తి, అర్ధవీడు మండలాల్లో 22 జగనన్న కాలనీల చొప్పున నిర్మాణమవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలోని మిగతా మండలాల్లో కూడా జగనన్న కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయి.

జిల్లాలో 67,669 గృహాల నిర్మాణం:

జిల్లా వ్యాప్తంగా మొత్తం 67,669 గృహాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు వెచ్చించి ప్రభుత్వం ఇంటి నిర్మాణం చేస్తోంది. అందులో రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం వాటాకాగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.30 వేలు అందజేస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీఏ విభాగంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరో రూ.35 వేలు వడ్డీలేని రుణంగా ప్రభుత్వం అందిస్తోంది. అదేవిధంగా పట్టణ, నగరాల్లో అయితే కేంద్ర ప్రభుత్వం వాటాగా ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.30 వేలు, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణంగా రూ.35 వేలు ఇస్తోంది.



చీమకుర్తి సమీపంలో కెవి.పాలెం రోడ్డులోని జగనన్న కాలనీ

రూ.284.18 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం:

జిల్లా వ్యాప్తంగా పేదల ఇంటి నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.284.18 కోట్లు ఖర్చు చేసింది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తూ నిర్మాణాలను వేగవంతం చేసుకుంటూ అధికారులు ముందుకు సాగుతున్నారు. టీడీపీ నాయకులు కోర్టులకెక్కి ఇళ్ల నిర్మాణాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఆ విధంగా తాత్కాలికంగా 16,856 ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. అవి కాకుండా జిల్లాలో 5274 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 4409 గృహాలు స్లాబులు పూర్తి చేసుకొని చివరి దశలో ఉన్నాయి. 2372 ఇళ్లు స్లాబు దశకు చేరుకున్నాయి. 7620 గృహాలు లింటల్ లెవల్‌లో ఉన్నాయి. 26,056 గృహాలు బేస్‌మెంట్ లెవల్‌కు చేరుకుంటున్నాయి. ప్రారంభం కాని గృహాలు 5082 ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న గృహాలకు ఇసుక, సిమెంట్, స్టీలుతో పాటు ఇతర నిర్మాణ అవసరాలు కూడా ప్రభుత్వమే లబ్ధిదారులకు అందిస్తోంది. ఈ పథకం కింద గతంలో నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకున్న వారు కాకుండా ఉగాది నాటికి అదనంగా 9,728 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో ఇప్పటికే 2,505 గృహాలు పూర్తయ్యాయి. మరో 7,223 లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

వేగంగా ఇళ్ల నిర్మాణం



జిల్లాలో పేదలకు అందజేస్తున్న సొంతింటి నిర్మాణాలు వేగంగా చేపడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-జగనన్న కాలనీల నిర్మాణాలు పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. ఇప్పటికే రూ.284.18 కోట్లు ఇళ్ల నిర్మాణాల కోసం ఖర్చు చేశాం. దాదాపు 570 జగనన్న కాలనీలు జిల్లాలో రూపుదిద్దుకుంటున్నాయి. ఉగాదికి పేదల ఇళ్ల నిర్మాణం, గృహ ప్రవేశాలు చేయించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు పూనుకున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం మేరకు అహర్నిశలు కష్టపడుతున్నాం. ఇసుకతో పాటు సిమెంట్, స్టీలు ఇతర నిర్మాణ సామగ్రిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందిస్తూనే ఉన్నాం.

– ఏఎస్.దినేష్ కుమార్, కలెక్టర్

ఎస్‌పీఎల్ రీజినల్ విజేతలు సర్‌సీఆర్ రెడ్డి, ఎన్‌ఆర్‌ఐ

- ముగిసిన రిజినల్ క్రికెట్ పోటీలు
- సీనియర్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి
- జూనియర్ విభాగంలో ఎన్‌ఆర్‌ఐ విజయం

Regional sponsor

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) రీజినల్ స్థాయి జూనియర్స్, సీనియర్ స్థాయి పురుషుల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ఉత్కంఠ భరితంగా ముగిశాయి. రెండో రోజు నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్ల మధ్యపోరు హోరాహోరీగా సాగింది. రీజినల్ స్థాయి విజేతల బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా ఏ గౌరిశంకర్‌రావు, గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ క్రీడాకారులు మాత్రమే వరల్డ్ చాంపియన్స్ అవ్వగలరని పేర్కొన్నారు. క్రీడల్లో రాణింపుతోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చున్నారు. శారీరక శ్రమ కలిగేలా ఆటలు ఆడటం వలన విద్యార్థులకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపి పర్యవేక్షించారు.

నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి విజయదుందుభి

రీజినల్ మ్యాచ్ జూనియర్స్ విభాగంలో భాగంగా నిర్వహించిన నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి (ఏలూరు) కాలేజీ విజయదుందుభి మోగించింది. మొదట టాస్ గెలిసి సర్‌సీఆర్‌రెడ్డి టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కల్లం హరనాథరెడ్డి (గుంటూరు) కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. అనంతరం 64 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి కాలేజీ కేవలం 5 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 64 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సర్‌సీఆర్ రెడ్డి కాలేజీ బ్యాట్స్‌మెన్ ఎస్‌కే సాయి చరణ్ 36 పరుగులు (4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మెరిపించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రేవంత్, 50 పరుగులు



విన్నర్స్ జూనియర్ ట్రోఫీ అందుకుంటున్న ఎన్నారై జూనియర్ కళాశాల, విజయవాడ జట్టు

సీనియర్స్ రీజనల్ విజేత సర్ సీఆర్ రెడ్డి

సాక్షి ప్రీమియర్ లీగ్ సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ (ఏలూరు) రీజినల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ (నెల్లూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సర్ సీఆర్ రెడ్డి కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది.అనంతరం 96 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు మాత్రమే చేసి 52 పరుగుల తేడాతో ఓటమి చెందింది. 32 పరుగుల చేసిన నాగవెంకట తేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

జూనియర్స్ రీజినల్ విజేత ఎన్‌ఆర్‌ఐ

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ విభాగంలో ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ) విజేతగా నిలిచింది. రన్నర్‌గా సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ (ఏలూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది.అనంతరం 94 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి 21 పరుగుల తేడాతో ఓటమి చెందింది. బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.



విన్నర్స్ సీనియర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఏలూరు

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు

1. సీనియర్స్ విభాగంలో సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి) వర్సస్ ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)
2. జూనియర్స్ విభాగంలో సాయి గణపతి కాలేజ్ (విశాఖపట్నం) వర్సస్ ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ)
3. సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ (ఏలూరు) వర్సస్ సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి)

జనం జేజేల నడుమ

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌లు దాఖలు

చిత్తూరు కలెక్టరేట్: జనం జేజేల నడుమ ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ నామినేషన్ల కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆదిమూలపు సురేష్, ఆర్.కే.రోజా, కాకాణి గోవర్ధనరెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి వైఎస్ఆర్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. వివిధ మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు అభ్యర్థులకు స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రులతో పాటు నిర్వహించిన ర్యాలీలో వైఎస్ఆర్ సీపీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టీచర్ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు నమస్కారం చేస్తూ నామినేషన్ కేంద్రానికి వచ్చారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతనేని చంద్రశేఖర్ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎస్.బాబు, ఎమ్మెల్సీలు భరత్, కళ్యాణ చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. వైఎస్ఆర్ టీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పలు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, 1998 డీఎస్సీ సంఘం నాయకులు మద్దతు పలికి ఘనంగా స్వాగతం పలికారు. నామినేషన్లు దాఖలు చేసిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్సీ అభ్యర్థులు విలేకరులతో మాట్లాడారు.



ర్యాలీగా నామినేషన్‌లు దాఖలు చేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు, మంత్రులు, ఎమ్మెల్యేలు



నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, పక్కన బాలినేని, సురేష్, రోజా

- కులమతాలకు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడ్డెర, మాదిగ, మాల ఇలా అన్ని కులాలకు సీట్లలో కేటాయించి సామాజిక న్యాయం పాటించిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ అని కొనియాడారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డి పోటీ చేస్తున్నారని వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి రోజా, తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరారు. గ్రాడ్యుయేట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీచర్ అభ్యర్థి ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర అణగారిన అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసేలా అభ్యర్థులను ప్రకటించారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే, అభ్యర్థుల గెలుపునకు పునాది అని పేర్కొన్నారు.
- 61% బీసీలకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీట్లు కేటాయించి సీఎం జగన్ చరిత్ర సృష్టించారని ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్నారు అనడానికి ఇదే నిదర్శనం అన్నారు.

బుధవారం పట్టభద్రులకు 15, టీచర్‌కు 6 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు మొత్తంగా పట్టభద్రులకు 23, టీచర్‌లకు 7 నామినేషన్‌లను దాఖలు చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే

ఒంగోలు సబర్బన్: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. ఈమేరకు వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. యువజన విభాగం అధ్యక్షుడిగా గొంగటి శ్రీకాంత్‌రెడ్డి (దర్శి), మహిళా విభాగం అధ్యక్షురాలిగా తమ్మినేని మాధవి (ఒంగోలు), రైతు విభాగం అధ్యక్షుడిగా సూరసాని మోహన్‌రెడ్డి (కనిగిరి), బీసీ సెల్ అధ్యక్షునిగా గోలి తిరుపతిరావు (ఒంగోలు), ఎస్సీ సెల్ అధ్యక్షునిగా జి.దేవప్రసాద్ (దర్శి), మైనార్టీ సెల్ అధ్యక్షునిగా సయ్యద్ జలీల్ (ఒంగోలు), చేనేత విభాగం అధ్యక్షునిగా సోయ యానాది శెట్టి (ఎస్ఎన్‌పాడు), క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా బోన రంజిత్ కుమార్ (గిద్దలూరు), సాంస్కృతిక విభాగం అధ్యక్షునిగా షేక్ సైదా (దర్శి), వైఎస్సార్ టీయూసీ అధ్యక్షునిగా మేకల చిన్న తిరుపతి (కనిగిరి), విద్యార్థి విభాగం అధ్యక్షునిగా రేలా అమర్‌నాథ్‌రెడ్డి (ఒంగోలు), వాణిజ్య విభాగం అధ్యక్షునిగా తడికమల్ల బాల సుబ్బారావు (మార్కాపురం), వికలాంగుల విభాగం అధ్యక్షునిగా దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి (మార్కాపురం), ప్రచార విభాగం అధ్యక్షునిగా చింతపల్లి హరిబాబు (కొండపి), పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా నర్రా సురేష్‌బాబు (ఎస్ఎన్‌పాడు), వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షునిగా గుజ్జుల సంజీవరెడ్డి (మార్కాపురం), ఐటీ విభాగం అధ్యక్షునిగా అలవల శంకర్‌రెడ్డి (వైపాలెం). జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని సీఎం జగన్ సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మార్కాపురం: వచ్చే నెల 15 నుంచి జరిగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్ బోర్డ్ ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 58,945 మంది విద్యార్థుల కోసం 95 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఇందులో ప్రథమ సంవత్సర విద్యార్థులు 24,674 మంది, ఒకేషనల్ విద్యార్థులు 3,315 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 27,487 మంది, ఒకేషనల్ విద్యార్థులు 3469 మంది ఉన్నారన్నారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 7 వరకు ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతున్నాయని, ఈ నెల 26 నుంచి వచ్చే నెల 7 వరకు జనరల్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు కలెక్టర్ ఆధ్వర్యంలో హై పవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, కస్టోడియన్‌లు ఉంటారన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు:

జిల్లాలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 5 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు పెడుతున్నట్లు తెలిపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు అవసరమైన ఏర్పాటు చేయాలని ఆర్‌టీసీ అధికారులను కోరినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్స్‌ను ఎవరు వినియోగించకూడదన్నారు. పరీక్షల నిర్వహణలో సిబ్బంది, విద్యార్థులు అక్రమ పద్ధతులకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సైమన్ విక్టర్

కొత్త ఆలోచనలతో పురోగమించాలి

- జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్
- ఉత్సాహంగా జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


విద్యార్థినుల శాస్త్రీయ నృత్యం


ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినులు


జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు టౌన్: సరికొత్త ఆవిష్కరణలతో విజయతీరాలకు చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ సూచించారు. ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సభలో ప్రసంగించారు. చిన్న విషయాలు కూడా జీవితంలో పెద్ద మార్పులు తీసుకొని వస్తాయని, కొత్త ప్రదేశాల్లో తిరగడం, నలుగురితో కలిసి మాట్లాడడం, తెల్లవారుజామున నిద్ర లేవడం లాంటివి కూడా విజయానికి తోడ్పడతాయన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే శక్తిని ఇస్తాయన్నారు. భవిష్యత్తు లక్ష్యాల గురించి విద్యార్థులకు సరైన సూచనలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బిడ్డల విషయంలో శ్రద్ధ తీసుకున్నట్టే పాఠశాలలో తమ వద్ద చదువుకునే విద్యార్థుల విషయంలో కూడా శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులు సరైన మార్గాన్ని సూచిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. జిల్లాలోని 38 మండలాల నుంచి తరలి వచ్చిన చిన్నారులను చూస్తుంటే తనకు బాల్యం గుర్తుకు వస్తుందన్నారు. కరోనా తరువాత తొలి సారిగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాని, జాయింట్ కలెక్టర్ సూచించినట్లు వచ్చే ఏడాది 3రోజుల పాటు నిర్వహించేందుకు కృషి చేస్తామని సభకు అధ్యక్షత వహించిన జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ చెప్పారు. మొత్తం 170 ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయన్నారు. శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని చెప్పారు. ఆలోచనలు ఉన్నతంగా ఉన్నప్పుడే ఉన్నతస్థితికి చేరుకోవడం సాధ్యమవుతుందని సెయింట్ జేవియర్స్ హైస్కూల్ కరస్పాండెంట్ వేలంగణి మేరి స్పష్టం చేశారు. అబ్దుల్ కలాం, అల్వా ఎడిసన్, రైట్ సోదరులు, మేడం క్యూరీల జీవితాలను విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కొత్త ఆలోచనలు ఉంటే కొత్త దారులు తెరుచుకుంటాయని చెప్పారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు. విజేతలుగా నిలిచిన 10 మంది ఈనెల 28 విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సులో హాజరుకానున్నారు. ఈ సభలో డిప్యూటీ ఈఓలు అనితారోజ్ రాణి, ఏ.చంద్రమౌళేశ్వర్, పీఈఓ ఎస్.సుబ్బారావు, డీసీఈబీ సెక్రటరీ డి.వెంకారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, ఒంగోలు ఎంఈఓ టి.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. పలు ప్రాజెక్టుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పంట పొలాలను నాశనం చేస్తున్న కోతులు, అడవి పందులను తరిమివేసేందుకు మంకీ గన్ తయారు చేసిన విద్యార్థి షేక్ అల్తాఫ్‌తో కలిసి ఫొటో దిగారు. విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

బహుమతులు గెలుచుకున్న టీంలు:

ఎకో ఫ్రెండ్లీ :
మొదటి బహుమతి : మంకీగన్, షేక్ అల్తాఫ్, జెడ్పీహెచ్ స్కూలు, ముండ్లపాడు. **ద్వితీయ బహుమతి:** ఫాగ్ మెషీన్, షేక్ ఉస్తేల బాబు, జెడ్పీహెచ్ స్కూలు, హనుమంతునిపాడు.

ఎన్విరాన్‌మెంటల్ అండ్ క్లైమేట్ చేంజ్
మొదటి బహుమతి: మెడిసిన్ అండ్ ఎర్త్ న్యూట్రియంట్, ఎం.శశాంక్, జెడ్పీహెచ్ స్కూలు, ముక్తినూతలపాడు, **ద్వితీయ బహుమతి:** నీరు మీరు, షేక్ హంషీరా, జెడ్పీహెచ్ స్కూల్, సింగరాయకొండ. **తృతీయ బహుమతి:** సోలార్ ఇరిగేషన్ సిస్టమ్, ఎం.అనుదీప్, జెడ్పీహెచ్ స్కూల్, చెరువుకొమ్ముపాలెం.

హెల్త్ అండ్ క్లీనింగ్స్:
మొదటి బహుమతి: మెడికల్ ప్లాంట్స్, జి.రేష్మ, జెడ్పీహెచ్ స్కూల్, ముక్తినూతలపాడు, **ద్వితీయ బహుమతి:** రివర్ క్లీనింగ్ బోట్, ఎన్.యశ్వంత్ రెడ్డి, జెడ్పీహెచ్ స్కూలు,పుసలపాడు, **తృతీయ బహుమతి:** స్వచ్ఛ భారత్,వై.వైష్ణవి ప్రణీత, ఎంపీయూపి స్కూలు, యడవల్లి.

సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్:
మొదటి బహుమతి: స్మార్ట్ డస్ట్‌బిన్, బి.హరిత, డా. అంబేడ్కర్ గురుకుల పాఠశాల, చీమకుర్తి. **ద్వితీయ బహుమతి:** మొబైల్ ఫోన్ మైక్రోస్కోప్, ఎం.నవీన, జీహెచ్ఎస్, పామూరు. **తృతీయ బహుమతి:** సర్వింగ్ రోబో, ఎల్.రాజ్‌కమల్, జెడ్పీహెచ్ స్కూల్, నిడమనూరు.

మ్యాథమాటికల్ మోడలింగ్:
మొదటి బహుమతి: ప్రెట్టి పాలినాచియల్స్ అండ్ ఫన్ విత్, షేక్.ఆషిఫా తబస్సుమ్, జి.హెచ్ఎస్, ఎర్రగొండపాలెం. **ద్వితీయ బహుమతి:** రామానుజన్ మ్యాథ్స్ సిటీ, ఏ.జితేంద్ర, ఏపీఎంఎస్, ముండ్లమూరు. **తృతీయ బహుమతి:** హౌటు ఫైండ్ సర్ఫేస్ ఏరియా ఆఫ్, పి.ఐశ్వర్య, జెడ్పీహెచ్ స్కూల్, కొనకనమిట్ల.


ప్రథమ స్థానం పొందిన వారికి ప్రశంస పత్రం, జ్ఞాపిక, బహుమతి అందజేస్తున్న జేసీ అభిషిక్త్‌కిషోర్, డీఈఓ రమేష్ తదితరులు


ద్వితీయ స్థానం పొందినవారు


తృతీయ స్థానం పొందిన వారు..


వైజ్ఞానిక ప్రదర్శన తిలకించేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు

చిన్నారులకు పెద్ద ఆలోచనలు

ఒంగోలు టౌన్: మండల స్థాయిలో 5 అంశాల్లో సత్తా చాటిన ఉత్తమ ప్రాజెక్టులను బుధవారం ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ హైస్కూలులో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మళ్లీ ప్రదర్శించారు. 170 ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి.

వర్షపు నీరును ఒడిసి పడుతూ..



కనిగిరి మండలం కొత్త ఏరువవారి పల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థినులు పి.శ్రీహరిణి, ఏ.అపూర్వ ఎకో హోంను ప్రదర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ పరిరక్షణతో పాటు ప్రకృతి సంపదను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది. వర్షపు నీరు వృథా కాకుండా ఇంటి ఆవరణలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు ఇంకిపోకుండా చేయవచ్చు. విద్యుత్, గోబర్ గ్యాస్, సేంద్రియ ఎరువులను ఇంటిలోనే తయారు చేసుకొనే ప్రాజెక్టు ఆకట్టుకుంది.

ఒక్కటే యంత్రం అనేక పనులు..



పవర్లెస్ టు పవర్‌ఫుల్ అనే మల్టీ పర్పస్ క్లీనింగ్ మిషన్ ఈ ప్రదర్శనలో పలువురిని ఆకట్టుకుంది. ఇది రోడ్లని పరిశుభ్రంగా ఉంచడంలో సహకరిస్తుంది. చెత్తను డంపింగ్ యార్డులో పడేస్తుంది. అలాగే బ్లీచింగ్ చేస్తుంది. డైనమో ద్వారా విద్యుత్‌ను తయారు చేసుకొని రాత్రి పూట కూడా అద్భుతంగా పని చేస్తుంది. నాగులుప్పలపాడు మండలం ఈదుముడి జెడ్పీహెచ్ స్కూలు విద్యార్థిని పి.నందిని తయారు చేసింది.

పంటలను రక్షించే మంకీ గన్



కొన్ని ప్రాంతాల్లో కోతులు, అడవి పందులు పంట పొలాలపై పడి నాశనం చేయడం తరచుగా మనం వింటూ ఉంటాం. చేతికి అంది వచ్చిన పంటను కాపాడుకోడానికి రైతులు అనేక పాట్లు పడుతుంటారు. అలాంటి వారి కోసం వచ్చిన ఆలోచనే మంకీ గన్. ఇది పేల్చితే మన పక్కనే బాంబు పడ్డట్టుగా పెద్ద శబ్దం చేస్తుంది. దాంతో కోతులు, అడవి పందులు పరార్ అవుతాయి. గిద్దలూరు మండలం ముళ్లమూరు జెడ్పీహెచ్ స్కూలులో పదో వతరగతి చదువుతున్న విద్యార్థి షేక్ అల్తాఫ్ దీన్ని ప్రదర్శించి ఎకో ఫ్రెండ్లీ విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

పొగమంచుకు పొగబెట్టవచ్చు..



చలికాలం వస్తే చాలు విపరీతంగా కురిసే పొగమంచు అనేక ప్రమాదాలకు కారణమవుతుంది. దీనికి పరిష్కారాన్ని చూపుతూ హనుమంతునిపాడు జెడ్పీహెచ్ స్కూలులో చదివే 10వ తరగతి ఉస్తేల బాలు రోడ్ల మీద దట్టంగా పేరుకుపోయిన మంచు తొలగించేందుకు ఆటోమేటిక్ ఫాగ్ రిమూవర్‌ను తయారు చేసి ప్రదర్శించాడు. హార్డ్ ఎయిర్ బ్లోయర్ ద్వారా పనిచేసే ఈ యంత్రం విద్యుత్ శక్తిని ఉష్ణ శక్తిగా మార్చి వేడి గాలిని బయటకు విడుదల చేస్తుంది. దీంతో మంచు కరిగిపోయి దారి స్పష్టంగా కనిపిస్తుంది. ఎకో ఫ్రెండ్లీ విభాగంలో ఈ ప్రదర్శన ద్వితీయ బహుమతిని గెలుచుకుంది.

ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయం..



ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ కప్స్, సాసర్లు, గ్లాసులను ప్రదర్శించింది పేర్నమిట్టలో 8వ తరగతి చదువుతున్న ఒ.మనోజ్ఞ. మొక్కజొన్న, వరిగడ్డితో తయారు చేసిన వస్తువులకు భవిష్యత్‌లో మార్కెట్ ఉంటుంది.


ఆటోమెటిక్ టాయిలెట్ క్లీనర్ ఇన్ స్కూల్స్

క్లుప్తంగా

సీఎంను కలిసిన వీసీ


ముఖ్యమంత్రిని కలిసిన పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు టౌన్: ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన యం.అంజిరెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. యూనివర్శిటీ అభివృద్ధికి సహకరించవలసిందిగా సీఎంకు విజ్ఞప్తి చేశారు. అందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీఈఓకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన వాహనం


గాయపడిన ఎంపీఈఓ బాలకాశి

బేస్తవారిపేట: మండలంలోని మోక్ష గుండం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీఈఓకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. నంద్యాల నుంచి శ్రీశైలంకు టయోటా వాహనం, కడప వైపుకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ట్యాంకర్‌ను ఒకవైపున ఢీకొట్టిన టయోటా కారు అదుపుతప్పి గిద్దలూరు వైపు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. అనంతరం ఈడ్చుకుంటూ రోడ్డుమార్జిన్‌లోని గుంతలో పడేయడంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న గిద్దలూరు ఏఓ కార్యాలయంలో ఎంపీఈఓగా పనిచేస్తున్న బాలకాశి కాళ్లు, చేతులు విరిగాయి. పరిస్థితి విషమంగా మారడంతో మార్కాపురం జిల్లా వైద్యశాలకు అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థినిపై మత్తు మందు ప్రయోగం

- నిందితులకు స్థానికుల దేహశుద్ధి


సంఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ సువర్ణ

మార్కాపురం: పట్టణ శివారు కాలనీలో పదో తరగతి చదువుతున్న తమ కుమార్తెపై కొంత మంది మత్తు మందు ఇచ్చి.. ఆపై ఏదో చేశారనే ఘటనపై, దర్యాప్తు చేయాలని కోరుతూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, విద్యార్థిని తల్లిదండ్రుల కథనం మేరకు.. పట్టణ శివారు కాలనీకి చెందిన బాలిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం పాఠశాల వదిలిన తరువాత విద్యార్థిని ఇంటికి వెళ్తున్న సమయంలో అదే కాలనీకి చెందిన మహిళ విద్యార్థినితో మాట కలిపింది. తనకు నీరసంగా ఉందని ఇంటి వరకు దింపాలని కోరడంతో విద్యార్థిని ఆమె చేయి పట్టుకొని కొద్ది దూరం వెళ్లగా తనకు దాహంగా ఉందని చెప్పి..మంచి నీళ్లు తాగి విద్యార్థినికి కూడా తాగమని ఇచ్చింది. కాసేపటికి విద్యార్థిని స్పృహతప్పి పడిపోయింది. రాత్రి 7 గంటల సమయంలో స్పృహలోకి వచ్చిన విద్యార్థిని చిల్లచెట్లల్లో ఉన్నట్లు గమనించి రోడ్డు పైకి వచ్చి ఫోన్ ద్వారా తన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. వెంటనే వారు అక్కడికి వచ్చి కుమార్తె తో మాట్లాడి విషయం తెలుసుకొని తమ కుమార్తెకు మత్తు మందు ఇచ్చి ఏదో చేశారని గుర్తించారు. సంఘటనకు బాధ్యులుగా భావించి మహిళను మరో వ్యక్తిని బుధవారం ఉదయం గుర్తించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సదరు వ్యక్తి మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. విషయం తెలిసిన వెంటనే టూటౌన్ ఎస్‌ఐ సువర్ణ నేరం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ విషయమై సీఐ భీమానాయక్‌ను వివరణ కోరగా తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో తమ కుమార్తెకు మత్తు మందు ఇచ్చారని పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేశామని విద్యార్థినిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి పంపుతామన్నారు. సదరు యువకునిపై కాలనీ వాసులు, విద్యార్థిని బంధువులు దాడి చేసిన సంఘటన పై కూడా కేసు నమోదు చేస్తున్నామని వివిధ కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబు నీచుడు

- సామాజిక న్యాయం అంటే చంద్రబాబుకు తెలుసా?
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు

ఒంగోలు సబర్బన్: సీనియర్ నాయకుడిని అని చెప్పుకుంటున్న మాజీ సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు నీచుడని.. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ధ్వజమెత్తారు. వారి కంటే ఎక్కువ పదాలు వాడగలనని.. కానీ తమ పార్టీ అధినేత సంస్కారం నేర్పారన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించినప్పటి నుంచి చంద్రబాబులో అభద్రతా భావం పెరిగిపోయిందన్నారు. మూడు రోజులుగా చంద్రబాబు మాట్లాడుతున్న మాటలు చూస్తే టీడీపీలోని నాయకులే చీదరించుకుంటున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో సామాజిక విప్లవం తీసుకొచ్చిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా బీసీలకు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతుంటే తట్టుకోలేక దూషణ పర్వాలకు తెరతీస్తారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ పదవులను 18 మందికి ఇస్తే వారిలో 11 మంది బీసీలు, నలుగురు ఎస్సీలున్నారన్నారు. చంద్రబాబూ నీ 14 సంవత్సరాల ముఖ్యమంత్రి అనుభవంలో ఎప్పుడైనా ఇచ్చావా అని నిలదీశారు. జడ్జీలుగా బీసీలు పనికిరారు అని చెప్పిన చంద్రబాబు ఏ ముఖం పెట్టుకొని బీసీల గురించి మాట్లాడుతారు అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన ఉనికిని చాటుకోవటానికి అల్లర్లు, గొడవలు చేయటమే పనిగా పెట్టుకొని తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ప్రజల బాగోగుల గురించి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. పట్టాభిని వీధుల్లోకి వదిలి శునకానందం పొందటం మినహా బాబు చేసేదేమీలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తీసేస్తాను అని చెప్పి పాదయాత్ర చేయాలంటూ లోకేష్‌కు సవాల్ విసిరారు. నాయకులు దుంపా చెంచిరెడ్డి, ఎద్దనపూడి శ్రీనివాస్, పలువురు సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఎదురొచ్చిన మృత్యువు


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ వీర్రాజు

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెనుక లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలై వాహనంలో ఇరుక్కుపోయాడు. పోలీసులు డ్రైవర్‌ను కాపాడి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ డ్రైవర్ సీహెచ్ వీర్రాజు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జాతీయరహదారిపై కలికవాయ ఫ్లైఓవర్‌పై జరిగింది. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ రైస్ మిల్ నుంచి నూకల లోడ్ లారీ స్థానిక పెరల్ డిస్టిలరీకి వస్తోంది. లారీ కలికవాయ ఫ్లైఓవర్ పై నుంచి దిగే క్రమంలో వెనకాల రాజమండ్రి నుంచి తమిళనాడు రాష్ట్రం రామేశ్వరానికి భారీ జనరేటర్‌ను తీసుకుని వెళ్తున్న లారీ వచ్చి ముందు లారీని ఢీ కొట్టింది. జనరేటర్‌తో వెళ్తున్న లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసం అవటంతో కోనసీమ జిల్లా తాతపూడి గ్రామానికి చెందిన సీహెచ్ వీర్రాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. క్యాబిన్‌లో ఉన్న జనరేటర్ యజమాని స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సమాచారం తెలుసుకున్న టంగుటూరు హైవే అంబులెన్స్ కానిస్టేబుల్ శశిధర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని చేరుకుని ప్రమాదాన్ని సమీక్షించి సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమాకు సమాచారం అందించారు. డ్రైవర్ వీర్రాజును అతికష్టం మీద క్యాబిన్ నుంచి బయటకు తీసి హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి లారీలను క్రేన్ సహాయంతో రోడ్డు మార్జిన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఫిరోజ్ ఫాతిమా వివరించారు.

జిల్లాలో విద్యుత్ బకాయిలు రూ.550 కోట్లు

మార్కాపురం/యర్రగొండపాలెం: జిల్లాలో మొత్తం రూ.550 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు ఆ శాఖ ఎస్ఈ కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ శాఖలకు చెందిన బకాయిలు రూ.420 కోట్లు ఉండగా వాటిలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల బకాయిలే రూ.300 కోట్లు ఉన్నాయని చెప్పారు. మార్కాపురం, యర్రగొండపాలెం విద్యుత్ డీఈ కార్యాలయాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాల్లో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 720 జగనన్న లే ఔట్లు ఉండగా ఇందులో 480 లేఔట్లలో విద్యుదీకరణ పూర్తయిందన్నారు. ఇళ్లు కట్టుకున్న వారికి 48 గంటల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తునట్లు చెప్పారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 22 వరకు 16,844 ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. జిల్లాలో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు మొత్తం 3084 ఉన్నాయని, వీటి స్థానంలో 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు రూ.36 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో 18 విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 30 సంవత్సరాలు దాటిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, స్తంభాలు మార్చేందుకు ఆర్డీఎస్ఎస్ కింద రూ.980 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మార్కాపురం ఈఈ పి.వి.నాగేశ్వరరావు, డీఈ షియానాయక్, ఒంగోలు టెక్నికల్ డీఈ సత్యనారాయణ, డీఈఈ టి.ఎం.రాఘవేంద్రరావు, ఏఈలు సుబ్బారాయుడు, పి.శ్రీనివాసరావు, టి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో అప్రమత్తంగా ఉండండి

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణుల సంరక్షణ కోసం సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని వైల్డ్‌లైఫ్ అడిషనల్ పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) శాంతిప్రియా పాండే పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లమల అభయారణ్యంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఆమె పర్యటించి వన్యప్రాణుల సంరక్షణపై సిబ్బంది పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ పెద్దపులుల అభయారణ్యంలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలు గుర్తెరిగి విధులు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది పరస్పర అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె పలు సూచనలు చేశారు. మండల పరిధిలోని పెద్దచేమ, కుడప, రోళ్లపెంట బేస్ క్యాంప్‌లను ఆమె పరిశీలించించారు. కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డైరక్టర్ విఘ్నేష్ అపావ, రేంజి అధికారి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.